విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

గురువారం 25, జులై 2024 | 8 పేజీలు

జిల్లాను అందరి సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తాం..!

జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అదితి సింగ్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో, జిల్లా ప్రజల అభిమానంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తామని.. వైఎస్ఆర్ జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ కు చేరుకున్న ఆమె.. జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా.. ఉదయం 10.10 గంటల సమయంలో వైఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అతిది సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, జిల్లా కలెక్టర్ సూచనలు, ఆదేశాల మేరకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సహకారంతో.. జాయింట్ కలెక్టర్ గా.. కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవం తంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ను.. ప్రజలకు సంతృప్త స్థాయిలో -2లో

జిల్లాలో చేనేత రంగానికి...

పూర్వ వైభవం తీసుకొస్తాం

మైలవరం టెక్స్ టైల్ పార్కు అభివృద్ధి సమీక్షా సమావేశంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జిల్లాలో చేనేత వృత్తికి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు.. ప్రపంచ మార్కెట్ లో మన చేనేత ఉత్పత్తులకు మంచి గుర్తింపును తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని.. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా చేనేత, జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు నాగరాజ రావు అధ్యక్షతన.. జిల్లాలోని మైలవరం మండలంలో టెక్స్ టైల్ పార్కు అభివృద్ధి పనుల పురోగతిపై.. కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. చేనేత కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం చేనేత, జౌళి శాఖ ద్వారా.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అభి వృద్ధి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. మగ్గాలనే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న జిల్లా చేనేత వృత్తిదారులను ఆదుకు నేందుకు, చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి దాదాపు 3000 మందికి ఉపాధి అవకాశాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని మైలవరం మండల పరిధిలో టెక్స్ టైల్ పార్కును ఏర్పాటు చేస్తోందన్నారు. 2005-06 ఆర్థిక సంవత్సరంలో 68.18 ఎకరాల్లో 118 ప్లాట్లతో ఈ పార్క్ ను అభివృద్ధి చేసేందుకు నాంది పలకడం జరిగిందన్నారు. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం రూ. 5.99 కోట్లు , రాష్ట్ర ప్రభుత్వం 1.39 కోట్లు కలిపి మొత్తం రూ. 7.38 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు -2లో

ఉక్కు పరిశ్రమ ఊసే లేని బడ్జెట్

రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఏది ..? : సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : రాష్ట్ర విభజన హామీలు అమలు చేస్తామని బిజెపి ఒకవైపున చెబుతూ మరోవైపున విభజన చట్టంలో ఉన్న కడప ఉక్కు పరిశ్రమ పై బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం అత్యంత దుర్మార్గమని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం వారు విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ 2024 25 యూనియన్ బడ్జెట్ లో విభజన చట్టంలో పేర్కొన్న హామీ చట్టబద్ధత కలిగిన హామీకి నిధులు కేటాయించకుండా మోసం చేసిందన్నారు టిడిపి ఎన్డీఏ కూటమితో పొత్తు పెట్టుకుని రాష్ట్రం నుండి 21 పార్లమెంటు సభ్యులను సంకీర్ణ ప్రభుత్వంలో ఉండి రాష్ట్రానికి పెద్దగా ఒరిగిందేమీ లేదన్నాను రాష్ట్రానికి రాజధాని అవసరమేకానీ సంస్థలు, కంపెనీలు ,పరిశ్రమలు రాజధాని కేంద్రంగా ఏర్పాటు చేయడం అభివృద్ధి కేంద్రీకృతం చేయటమే అన్నారు. అభివృద్ధిని అన్ని జిల్లాలకు పంచి పెట్టాలంటే అన్ని ప్రాంతాలలో వివిధ ఉన్నత విద్యాసంస్థలు,వైద్య సంస్థలు తోపాటువనరుల ఆధారంగా పరిశ్రమలు,ఐటీ పరిశ్రమలు ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. కడప ఉక్కు పరిశ్రమకు ముగ్గురు ముఖ్యమంత్రి నాలుగు సార్లు పునాదిరాళ్లు వేశారే తప్ప పరిశ్రమ నిర్మాణం కు నిర్దిష్టమైన ప్రణాళికతో నిధులు కేటాయించి పనులు ప్రారంభించ లేదన్నారు బిజెపి సంకీర్ణ ప్రభుత్వానికి ఎన్డీఏ కూటమితో రాష్ట్రం నుండి 21 మంది ఎంపీలు అందించి ఎన్డీఏ ప్రభుత్వాన్ని నిలబెడితే రాష్ట్రానికి చేసిన మేలు ఏమీ లేదన్నారు రాయలసీమ అత్యంత వెనుకబాటు తనానికి గురైందని కరువుల నుండి శాశ్వతంగా బయటపడాలంటే నీటిపారుదల ప్రాజెక్టు లు యుద్ధ ప్రాతిపాదన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి నీటిపారుదల ప్రాజెక్టులకు యూనియన్ బడ్జెట్లో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నప్పటికీ కేవలం రాజధానికి నిధులు ఇచ్చి రాష్ట్రానికి మేలు చేశామని సంకలు గుద్దుకోవటం ఏమిటని వారు ప్రశ్నించారు. 2024 బి25 యూనియన్ బడ్జెట్‌ను సవరించి రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేయాలని అదేవిధంగా విభజన చట్టంలో ఉన్న రాజధాని తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన పరిశ్రమ కడవ ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించి ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని లేని పక్షంలో ఆందోళన చేయక తప్పదని వారు హెచ్చరించారు.

జేసీగా బాధ్యతలు స్వీకరించిన

ఆదర్శ్ రాజేంద్రన్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా నూతన సంయుక్త కలెక్టర్ గా నియమితులైన ఆదర్శ్ రాజేంద్రన్, ఐఏఎస్, బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సహకారంతో, జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపించేం దుకు కృషి చేస్తానన్నారు. అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించే ముందు బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని రెవెన్యూ అతిథి హౌస్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంయుక్త కలెక్టర్ కు డిఆర్ఓ సత్యనారాయణరావు, మరియు వివిధ శాఖల అధికారులు మరియు కలెక్టరేట్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

మంత్రి సవితతో ఎమ్మెల్యే 'ఆది'భేటి

- చేనేతల సమస్యలపై చర్చించిన చదిపిరాళ్ల
- సానుకూలంగా స్పందించిన మంత్రి సవిత

విశాలాంధ్ర- యర్రగుంట్ల: రాష్ట్ర టెక్స్టైల్ శాఖ మంత్రి శ్రీమతి సవితను జమ్మలమడుగు ఎమ్మెల్యే చది పి రాళ్ల ఆదినారాయణ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను కలిసిన ఎమ్మెల్యే ఆది నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా చేనేత వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు నేత కార్మికుల సమస్యలను పరిష్కరించడం ద్వారా వారికి అండగా నిలవాల్సిన ఆవశ్యకతను మంత్రి సవిత దృష్టికి ఎమ్మెల్యే ఆది తీసుకు వచ్చినట్లు సమాచారం సావధానంగా ఆలకించిన మంత్రి సవిత వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈ భేటీలో నియోజకవర్గ టిడిపి బాధ్యులు చది పి రాళ్ల భూపేష్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

చీకటి వాండ్లపల్లెను వణికిస్తున్న విష జ్వరాలు

విశాలాంధ్ర- రామాపురం : మండలంలోని హసనాపురం పంచాయతీ చీకటి వాండ్లపల్లిలో పిల్లలు విష జ్వరాల బారిన పడే అల్లాడి పోతున్నట్టు తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రస్తుత సీజన్లో గ్రామాలలో దోమల బెడద ఎక్కువై విష జ్వరాలు బారిన పడి అల్లాడిపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చి మొక్కలు గుంతలలో నీరు నిలవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయి అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల అంగనవాడి పాఠశాలలో చదువుతున్న బాల బాలికలకు సుమారు 20 మంది పిల్లలకు పై బడి వాంతులు విరేచనాలు. విష జ్వరాలు వచ్చిన వారిలో నిచిత శ్రీధర్ నాయుడు ఉమేష్ నాయుడు మరో కొంతమందికి విష జ్వరాలు ఎక్కువ వచ్చాయి అందులో నిశ్చితా. శ్రీధర్ నాయుడు. ఉమేష్ నాయుడు. ధ్రువిక. నందిన. మరో కొంతమంది చిన్నారులు చికిత్స కోసం కడప శివయోగి హాస్పిటల్కు తరలించి అక్కడ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రాయచోటి కడప ప్రాంతాలకు పిల్లలను తీసుకుపోతున్నట్లు తల్లిదండ్రు లు తెలిపారు. దీక్షిత అనే బాలికకు రాయచోటిలోని ప్రైవేట్ డాక్టర్లు డెంగ్యూ జ్వరం అని డాక్టర్లు చెప్పడంతో కడప ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఎక్కువగా చిన్నపిల్లలకే జ్వరాలు. వాంతులు. విరేచనలు రావడానికి కారణం తాగునీరు దోమల వల్ల వ్యాధులు వ్యాపిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక వైద్యాధికారి వినోద్ కుమార్ ను వివరణ కోరగా గ్రామంలో తమ ఆరోగ్య సిబ్బంది పర్యటిస్తుందని తాము గురువారం ఉదయాన్నే సిబ్బందితో వెళ్లి గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి అన్ని రకాల పరీక్షలు చేస్తామని ఆయన తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర-రామాపురం.: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నమయ్య జిల్లా డీఈవో శివ ప్రకాశ్ రెడ్డి అన్నారు. శిక్షసప్తహే కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గువ్వలచెరువు తెలుగు. ఉర్దూ. నీలకంఠ రావుపేట తెలుగు. ఉర్దూ. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమ్మన్నారు. ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు జరిగే భారతీయ సంప్రదాయానికి చెందిన ఆటలను పిల్లలతో కలిసి ఆయన క్రీడలను పర్యవేక్షించారు. వారం రోజులు పాటు వివిధ రకాల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం ఆయన నీలకంఠరావుపేట తెలుగు హైస్కూల్లో ఉపాధ్యాయులతో ఆయన సమావేశం మై విద్యార్థులకు సబ్జెక్ట వారిగా విద్యను అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణశాతం పెంచాల న్నారు. పాఠశాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల గురించి హెడ్మాస్టర్ సుజాతమ్మ ను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు సంబంధించి బుక్స్ షూస్ డ్రస్సులు పంపిణీ చేశారని అడిగారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ పిల్లలకి డ్రస్సులు మాత్రం మండల హెడ్ క్వార్టర్ లో ఉన్నాయని అవి తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ. పాఠశాల పిడి ఎస్ నాగేందర్ రెడ్డి. డివో ఆఫీస్ సిసి అభిబ్. పి ఆర్ టి యు హుక్కు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌గా చేయడంపై అవగాహన

విశాలాంధ్ర-వీరబల్లి : వీరబల్లి మండలం నందు గల మట్లి గ్రామ పంచాయతీ నీ క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ గా చేయటం లో బాగంగా గ్రామపంచాయతీ పరిధి నందు గల చెత్త కుప్పలను , దారికి ఇరువైపులా ముల్లపొడలు లేకుండా చేయటం జరగుతుంది. మరియు గ్రామ పంచాయతీ నందు ప్రతి రోజూ క్లాప్ మిత్రాస్ ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేసి చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి తరలించడం జరుగుతుంది. గ్రామ పంచాయ తీలో ఫ్యాగింగ్ చేసి దోమలు రాకుండా తగు జాగ్రత్త తీసుకోవటం, గ్రామ పంచాయతీ నందు గల డ్రైనేజ్ వ్యవస్థల ను క్లీన్ చేయటం జరిగినది కావున గ్రామ పంచాయతీ నందు ఎటువంటి వ్యర్థాలను రోడ్ పైన వేయకుండా ప్రజలందరికీ అవగాహన కల్గించటం జరుగుతుంది. ఈ విధంగా గ్రామ పంచాయతినీ ఈ నెల 30 వ తేదీ లోపు క్లీన్ అండ్ గ్రీన్ గ్రామ పంచాయతీ గా తీర్చిదిద్దిటం జరుగుతుంది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ గారు నాగార్జున ఆచారి ఎంపిడిఒ రామచంద్ర రెడ్డి ,పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ మరియు గ్రామ పెద్దమనుషులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

... పూర్వవైభవం తీసుకొస్తాం

(మొదటి పేజీ తరువాయి) రూ. 3.85 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేయడం జరిగిం దన్నారు. కాగా ల్యాండ్ డెవెలప్మెంట్, రోడ్లు, భవనాల నిర్మాణం, క్లినిక్, క్యాంటీన్, పవర్, వాటర్ సప్లై.. తదితర అభివృద్ధి మౌలిక సదుపాయాల పనులకు రూ. 2.78 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. కాగా.. ఇప్పటికే ఏపీఈడబ్ల్యుఐడిసి, ఆర్డబ్ల్యుఎస్, ఏపీఎస్పీడిసిఎల్ శాఖల ద్వారా సివిల్ వర్క్స్, వాటర్, పవర్ సప్లై పునరుద్ధరణ పనుల కోసం.. రూ. 1.14 కోట్లు వినియోగించేందుకు రాష్ట్ర చేనేత జౌళి శాఖ పరిపాలనా అనుమతులిచ్చిందన్నారు. ఈ టెక్స్ టైల్ పార్కులో యూనిట్ల స్థాపన కోసం ఇప్పటికే 47 మంది దరఖాస్తు చేసుకొని ప్లాట్లు సొంతం చేసు కోగా.. ఇంకా 75 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే అన్ని రకాల మౌలిక సదుపాయాలను సమకూర్చడం జరిగిందన్నారు. వారి ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించనుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాలుగా కార్మికులకు రాయితీలు ఇస్తోందని.. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్ఎం ఏపీ ఐఐసి, ఏపీఎస్పీడిసిఎల్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్, సంబందిత శాఖల అధికారులు, జిల్లా చేనేత జౌలు శాఖ అధికారులు, చేనేత యూనిట్లు పెట్టె ఎంటర్ ప్రెన్యూర్ లు తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ఇన్‌చార్జ్ వీసి కృష్ణారెడ్డిని తొలగించేవరకు ఉద్యమం: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-కడప రూరల్ : తీవ్ర లైంగిక ఆరోపణలు వున్న కృష్ణా రెడ్డిని వైవియు ఇంచార్జ్ విసి గా నియమించడం సిగ్గు చేటని తక్షణమే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్లో ఆందోళన పోలీసులు అత్యుత్సాహం వల్ల దాసరి భవన్ ముందే ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్చార్జి వీసీగా నియామ కం అయిన కృష్ణ రెడ్డి గతంలో కృష్ణ యూనివర్సిటీలో రిజిస్టర్ గా పనిచేసే రెండు సంవత్సరాలు కాగా పలుకుబడితో మూడు సంవత్సరాలు చేసుకొని తన యొక్క అవినీతి, లైంగిక దురాలవాట్ల వల్ల అక్కడ ఉన్న ఉద్యోగిలను విద్యార్థులను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని ఒకటిన్నర సంవత్సరానికే ప్రభుత్వం తనపై కమిటీ వేసి సస్పెండ్ చేసింది, యోగి వేమన యూనివర్సిటీ లో ప్రిన్సిపాల్ గా ఉండి తన వైఖరి ఏమాత్రం మార్చుకోకుండా ఇదే పద్ధతుల్లో వ్యవహరించిన తీరు స్పష్టంగా యూనివర్సిటీ మొత్తం గమనించిం దన్నారు... కమిటీ వేసి విచారణ లో ఆరోపణలు వాస్తవం అని తెలచ్చిందని, వెంటనే ప్రిన్సిపాల్ గా తొలిగించిం దన్నారు. అయితే ప్రభు త్వం మరియు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ సౌరబ్ గౌర్ ఇలాంటి కామ పిశాచి ని ఇంచార్జ్‌గా వీసీ కృష్ణారెడ్డి నియామకాన్ని ఏ విలువలతో నియమించిందో విద్యాశాఖ మంత్రి లోకేష్ సమా ధానం చెప్పాలని అన్నారు. విలువలతో కూడిన ప్రభు త్వం, సంక్షేమ ప్రభుత్వమని లైంగిక వేధింపులున్న వ్యక్తిని యోగి వేమన యూనివర్సిటీ విలువలను ప్రతిష్టను వీసీ కుర్చీ తో దిగజార్చుతున్నరన్నారు. వెంటనే ప్రభుత్వం, ప్రిన్సిపల్ సెక్రెటరీ సౌరబ్ గౌర్ నియామకాన్ని వెనక్కి తీసుకోకపోతే పోరాటం చేస్తామని అన్నారు. గవర్నర్ దృష్టికి కూడా తీసుకు పోతామన్నారు. తొలగించేంతవరకు పోరాటం చేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.వలరాజు, రాష్ట కోశాధికారి సాయికుమార్, నాయకులు రంజిత్, జగదీష్, రంజిత్, జగదీష్, అయ్యప్ప, సురేష్ నాయకులు పాల్గొన్నారు.

వైవీయూ జాబ్ మేళాలో 32 మంది ఎంపిక

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జాబ్ మేళను ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, కుల సచివులు ఆచార్య ఎస్ రఘునాథరెడ్డి, ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి తో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సమాజ ఉపయో గికంగా పనిచేస్తుందన్నారు. విశ్వవిద్యాలయానికి మరిన్ని కంపెనీల ఆహ్వానించి ఇక్కడ చదువుతున్న విద్యార్థులతోపాటు బయట వారికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యతను తీసుకున్నామని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన వారు అంకిత భావంతో పనిచేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంద న్నారు. ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి మాట్లాడు తూ విశ్వవిద్యాలయానికి వచ్చిన కంపెనీలు విశ్వసి నీయమైనవని అందులో ఉద్యోగాలు పొందితే దీర్ఘకాలం కొనసాగ వచ్చన్నారు. ప్లేస్మెంట్ సెల్ సంచాలకులు ఆచార్య ఎల్.వి. రెడ్డి మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల ప్రయోజనక రంగా ప్లేస్మంట్ సెల్ పనిచేస్తుందన్నారు. భవిష్యత్తు లో మరిన్ని ఉద్యోగ ఎంపికలను నిర్వహిస్తా మని తెలిపారు. టీసీఎల్ డైరెక్టర్ శివకుమార్, అపో లో ఫార్మసీ కంపెనీ హెచ్ ఆర్ శశికాంత్ కుమార్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 32 మందిని యువతను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. తమ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి వేతనంతో పాటు మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తున్నామని తెలిపారు. కంపెనీల గురించి వివరించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

విశాలాంధ్ర - బద్వేలు : కడప నెల్లూరు సరిహద్దు అటవీ ప్రాంతం నుండి ఎర్ర చందనం అక్రమంగా నరికి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాలపై గట్టిగా నిఘ బెట్టి అరెస్ట్ చేయమని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినందున జిల్లా అడిషనల్ ఎస్పీ ఎల్ సుధాకర్ మైదుకూరు డిఎస్పి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో బద్వేల్ రూరల్ సీఐ విక్రమ సింహ సదర విషయం పైన ఇన్ ఫార్మర్ల ద్వారా నిగా ఉంచి బద్వేల్ రూరల్ ఎస్సై రవికుమార్ వారి సిబ్బంది మంగళవారం రాత్రి 7:30 గంటల సమయంలో గోపవరం మండలం లో పి పి కుంట సమీపంలో నెల్లూరు రోడ్డుకు దక్షిణం వైపున ఉన్న రేగమానుకుంట వద్ద గల అటువి ప్రాంతంలో నెల్లూరు జిల్లా కు చెందిన నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లు షేక్ రసూల్ సుంచనూరు గ్రామం పాలెం పెంచల ప్రసాద్ అనంతపురం గ్రామం ఆవుల పోల్ చిన్నయ్య తిమ్మా నాయుడుపేట గుద్దేటి రఘునాథరెడ్డి ఎర్రబల్లి పాలెం లను అరెస్టు చేసి అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన 59 ఎర్రచందనం దుంగలను రవాణా చేయుటకు ఉప యోగించిన గూడ్స్ వాహనమును ముద్దాయిలు ఉపయోగించిన రెండు మోటర్ సైకిల్లను వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు బుధవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు ఈ సందర్భంగా మైదుకూరు ఎస్ డి పి ఓ మాట్లాడుతూ ఎర్రచందనం నరికిన అమ్మిన కొన్న అక్రమ రవాణా చేసిన అందుకు ఏ విధంగా సహకరించిన నాన్బెయిలబుల్ కేసులు పెట్టి వారిపై హిస్టరీ సీట్లు తెరుస్తామని పదే పదే ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై పిడి యాక్ట్ అమలు చేస్తామని మైదుకూరు ఎస్ డి పి ఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ప్రజలు ఎవరికైనా ఇలాంటి సమాచారం తెలిస్తే పోలీస్ వారికి తెలియజేయాలని మీ వివరాలు గోప్యంగా ఉంచి నేరస్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.వారు రాకను గమనించి కొంతమంది గుర్తు తెలియని ముద్దాయిలు నేర స్థలం నుండి పారిపోయినారు వారినికూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. ఎర్రసందనం స్మగ్లర్లను అరెస్టు చేయడంలో చకాచక్యంగా వ్యవహరించిన బద్వేల్ రూరల్ సీఐ విక్రమ్ సింహ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జె రవికుమార్ వారిసిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రశంసించారు.

రెవెన్యూ కార్యాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలు

విశాలాంధ్ర- రామాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోలను ఏర్పాటు చేసినట్లు తాసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో రికార్డు రూములు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని. రాత్రిపూట వాచ్మేన్ ఇద్దరు వీఆర్ఏలు కాపలా ప్రతిరోజు ఉంటారని అన్నారు. ప్రతి గదిలోను పరిశుభ్రంగా చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ సిద్దేశ్వర రావు మండల సర్వే నాగలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సాధించండి

విశాలాంధ్ర- రామాపురం: గ్రామపంచాయతీలలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సాధించాలని మండల విస్తీర్ణ అధికారి ఈవోపీఆర్డి ఉషారాణి అన్నారు. గ్రామాలలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో పనులను ఆమె పరిశీలించారు. ఇందులో భాగంగా బుధవారం కసిరెడ్డి గారి పల్లి. గువ్వలచెరువు. గోపిగుడిపల్లి. బండ పల్లి. చిట్లూరు. నీలకంఠరావుపేట. తదితర గ్రామాలలో ఆమె పర్యటించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడం తో దోమలు వృద్ధి చెంద కుండా ఇంటి పరిస్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. సూర్య నారాయణపురంలో సర్పంచ్ కార్యదర్శి ఆధ్వర్యంలో ముమ్మరంగా పరిశుద్ధ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మునిపాటి ధనలక్ష్మి కార్యదర్శి నాగవేణి టిడిపి నాయకులు బండారు తిమ్మారెడ్డి. చిట్టి రెడ్డయ్య పాల్గొన్నారు.

..అభివృద్ధి పథంలో నడిపిస్తాం

(మొదటి పేజీ తరువాయి) అందేలా కృషి చేస్తా నని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. తొలుత తాను 2020 సంవత్సరం బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారినని, ముందు తిరుపతి మున్సిపల్ కమిషనర్ గా 6 నెలలు పనిచేశానని, అంతకుముందు తొలుత విశాఖపట్నం జిల్లాలో శిక్షణ పొంది విజయవాడ సబ్ డివిజన్ లో సబ్ కలెక్టర్‌గా దాదాపు 14 నెలలు పని చేశానని చెప్పారు. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌గా కడప జిల్లాకు రావడం ఎంతో సంతోషంగా ఉం దన్నారు.అంతకు మునుపు జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి వారిని మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కను అందించారు. పలువురు జిల్లా అధికారులు, ప్రముఖులు, పాత్రికేయులు, పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికి జేసీకి తమ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో గంగాధర్ గౌడ్, పులివెందుల, బద్వేలు డివిజన్ల ఆర్డీవోలు వెంకటేష్, చంద్రమోహన్, పి. వేణుగోపాల్ రెడ్డి, కలెక్టరేట్ పరి పాలన అధికారి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని జేసీకి వినతి

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటిలోని మాసాపేట వద్ద ఉండే ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుల శంకర్ నాయకులు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్‌కు బుధవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం కాలంగా రాయచోటి పట్టణంలోని మాసాపేట గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నీరు లేక బాలికలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి స్నానాలు చేయడానికి కూడా నీరు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారని, దాదాపు 430 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్లో కనీసం ఆర్ఓ ప్లాంట్ కూడా లేదని, నీటి సౌకర్యం లేక బయట నుండి ట్రాక్టర్లతో ట్యాంకర్ల రూపంలో తోలినప్పటికీ ఏమాత్రం సరిపోవటం లేదని కలెక్టర్ గ్రాంట్‌లో బోరును వేసి నీటి సమస్యను పరిష్కరించి గిరిజన ఆడబిడ్డలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నీరు లేని కారణం చేత స్నానాలు చేయక అక్కడ ఉన్న గిరిజన బిడ్డలు అనేక రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని నీటి సమస్యలు పరిష్కరించాలని, అలా కాని పక్షంలో విద్యార్థినిలతో తప్పకుండా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డినాయక్ పాల్గొన్నారు.

బడ్జెట్ లో రాష్ట్రానికి కేటాయింపులు శుభ పరిణామం..

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఇది కూటమి ప్రభుత్వం విజయంఅనిబడ్జెట్ లో రాష్ట్రానికి కేటాయింపులు శుభ పరిణామని జఫన్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్, టిడిపి నాయకులు పందిటి డేవిడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.రాష్ట్రానికి ఎన్నో ప్రయోజనాలు ఈ బడ్జెట్ వల్లన చేకూరుతాయని పేర్కొన్నారు. పోలవరం పూర్తి అయితే ఈ రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు.వెనుబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు ఇవ్వడం హర్షణీయమన్నారు.అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ప్రత్యేక సాయం అందడం రాష్ట్రానికి శుభపరిణా మమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి వల్లనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి చొరవతో కడప నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. చంద్రబాబు పాలన లో మైదుకూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో గడిచిన 5 సంవత్సరాల వైసిపి పాలనలో కూల్చుడాలు తప్ప రాష్ట్రం లో అభివృద్ధి జరగలేదని అన్నారు. దేశం లో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్లో రాష్ట్రానికి రాజధాని లేకుండా వైసిపి ప్రభుత్వం పరిపాలన చేసిందన్నారు. మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా చేశారన్నారు. ఈ సమావేశంలో నాయకులు గడ్డం శ్రీనివాసులు చిన్న పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలి

విశాలాంధ్ర-తొండూరు: మహిళా ఉద్యోగుల పట్ల ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో విష్ణు ప్రసాద్, సిడిపిఓ శ్రీలత పేర్కొన్నార్ను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు 2013 (పోష్ యాక్ట్) నిరోధక చట్టంపై గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించార్ను ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా యాజమాన్యం బాధ్యత వహించాలని కోరార్ను మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు నివారించేందుకు పోష్ యాక్ట్ చట్టాన్ని 2013 ఏప్రిల్ 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నార్ను మహిళలను తాకడం, మాటలు, సైగలు, పోర్న్ వీడియోల ద్వారా మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జిలాని ఐసిడిఎస్ సూపర్వైజర్ రవణమ్మ , సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి వడివడిగా అడుగులు !

నిన్న ఎమ్మెల్యే 'ఆది' కృషితో రూ.1.25కోట్లు- నేడు డీఎంఎఫ్ నిధులు రూ.50లక్షలతో పనులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆది నారాయణరెడ్డి అభివృద్ధి పనులకు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే ఎర్రగుంట్ల పురపాలికకు ఎమ్మెల్యే ఆది కృషితో కడప అర్బన్ డెవలప్‌మెంట్ (కుడా) విభాగం నుండి మొదటి విడతగా రూ.1.25కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించగా ఇదే విభాగం నుండి మరో రూ.50లక్షలు కూడా మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఉన్నతాధికారులను కోరి ఉన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) నిధులు రూ.50లక్షలు విడుదల కానున్నాయి. ఆ మేరకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సంబంధిత అధికారులతో చర్చించినట్లు సమాచారం. ఈ నిధులతో పురపాలిక నీటి సరఫరాకు ఉద్దేశించిన పలు పనులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా పోట్లదుర్తి సమీపంలోని రామాంజనేయపురం వద్ద గల బోరుబావులకు సంబంధించిన స్థలాలు కబ్జాకు గురికాకుండా ప్రహరీ గోడలను నిర్మించనున్నారు. ప్రహరీ గోడల నిర్మాణం, అదనపు బోరుబావులను తవ్వనున్నారు. అలాగే పోట్ల దుర్తి వంతెన వద్ద దెబ్బతిన్న మంచి నీటి పైపులైన్ స్థానం లో డీఐ పైపులను అమర్చి పైపు లైన్‌ను పునరుద్దరించనున్నారు. మొత్తంగా ఎమ్మెల్యే ఆది కృషితో ఎర్రగుంట్లలో అభివృద్ధి పనులు వడి వడి గా అడుగులు ప్రారంభించనున్నాయని చెప్ప వచ్చు. తద్వారా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా పనులు చేపట్టల్సిన ప్రాంతాలను కూటమి పార్టీల మండల పర్యవేక్షకులు తప్పెట్ల మధుసూధన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ మూలే హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణ, ఏఇ సురేష్, ఆర్ఓ గంగిరెడ్డి పరిశీలించారు. వీరు హనుమన గుత్తి రస్తాలో పురపాలికకు అవసరమైన డంపింగ్ యార్డ్‌కు 10 ఎకరాల స్థలాన్ని కూడా పరిశీలించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని, రాబోయే రోజుల్లో ఏపీకి మంచి రోజులు రాబోతున్నాయని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆరీ పుల్లా తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి 15వేల కోట్ల రూపాయలు కేటాయించడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నడూ లేనివిధంగా ఏపీకి నిధులు కేటాయింపు జరిగిందన్నారు. త్వరలోనే ఏపీ రాజధాని అమరావతి నెంబర్ వన్‌గా నిర్మాణం కాబోతుందన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు పూర్తికి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఏపీకి 15వేల కోట్ల రూపాయలు బహుమతిగా ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన చిన్నాన్న వైఎస్ వివేకానంద రెడ్డిని హత్య చేస్తే ఇప్పటి వరకు ధర్నా చేయలేయకపోగా, ప్రస్తుతం తన పార్టీ నేతలతో కలిసి ధర్నా చేయడం హేయమైన చర్య అన్నారు. తన హయాంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఎటువంటి న్యాయం చేయకపోగా, చంద్ర బాబు నాయుడు చేస్తున్న అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి సహకరించాలన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే అటు అభివృద్ధి, ఇటు సంక్షేమ పరంగా రాష్ట్రం ముందుకు సాగుతుందని తెలియజేశారు.

నిబంధనలకు లోబడి వినాయక విగ్రహాల తయారుచేయాలి

విశాలాంధ్ర-రాయచోటి: కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు లోబడి వినాయక విగ్రహాలు తయారు చేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ వాసు బాబు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పర్యావరణ సహిత, ఆరోగ్యకర ఆహ్లాదకర వాతావరణంలో వినాయక చవితి, జరిగేలా ప్రజల్లో అవగాహన పెంచాలని చేపట్టాలని అధికారులు నిర్ణంచారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్ అధికారులు సమావేశమై పర్యావరణ రహిత వినాయక చవితికి తీసుకోవలసిన నిర్ణయాల పై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ వాసు బాబు, తహసీల్దార్ జయన్న మాట్లాడుతూ సెప్టెంబర్ మాసంలో జరిగే గణేష్ ఉత్సవాల నిర్వహణకు మట్టితో చేసిన ఉత్సవ విగ్రహాలను మాత్రమే వినియోగించేలా ప్రజలు చైతన్య వంతులు కావాలని పిలుపునిచ్చారు. అందుకోసం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నిబంధనల మేరకు ముందస్తుగా విగ్రహాల తయారీదారులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తూ పిఓపి విగ్రహాల తయారీని అరికట్టి పర్యావరణ సహిత మట్టిబొమ్మలను మాత్రమే తయారు చేసి అమ్మకాలు చేపట్టేలా చర్యలు చేపట్టామని తెలిపారు. మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేసి నిమజ్జనం చేసేలా ప్రజలు ధార్మిక సంస్థలు సహకరించాలని కోరారు. మండపాలలో ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, కప్పులు వాడారదని ప్రజల కు సూచించారు. ఈ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ కఠినంగా ఉండాలని నిర్ణయించారు. స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సమన్వయంతో అందరం కలసి పనిచేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. వినాయక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు. గణేష్ ఉత్సవాలకు మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ ప్రచురించిన గోడ పత్రాలు, కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు. ఈ సమన్వయ సమావేశంలో ఫైర్ అధికారి వెంకటరామి రెడ్డి, అర్బన్ ఎస్ఐ శ్రీహరి, విద్యుత్ శాఖ ఏడి చాన్‌బాషా, డిటి రామాంజనేయులు, టీపీఓ లక్ష్మి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, నాగేశ్వరరావ్ పాల్గొన్నారు.

వరి పంటలో కాలిబాటలు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్నదండ్లూరు గ్రామంలో రైతులు సాగుచేస్తున్న వరి పంటను సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి పరిశీలించారు. గ్రామంలో సుమారు 900 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఉత్తమపంట యాజమాన్య పద్ధతి అయిన కాలిబాటలు తీయడం రైతులు ఆచరించడం లేదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి కాలిబాటలతో చేకూరు ప్రయోజనాలను రైతులకు వివరించారు. పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందడంతో అధిక దిగుబడికి అవకాశం ఉందన్నారు. ఎరువులు, పురుగుల మందుల పిచికారికి సులభంగా ఉంటుందన్నారు. సుడిదోమ తెగులు నియంత్రించడుతుందన్నారు. తూర్పు పడమర దిశలో ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాట వరినాటిన సమయం నుండి 15 రోజులలోపు ఈ కాలిబాట 20 సెం.మీ. వెడల్పు ఉండాలన్నారు. సకాలంలో రైతులు, మందులు పిచికారి చేయడం ద్వారా ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నరసాపురం ఎంపీడీఓకు శ్రద్ధాంజలి

విశాలాంధ్ర-రామాపురం : నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ మృతి పట్ల అన్నమయ్య జిల్లా రామాపురం మండలం ఎంపీడీవో ప్రభాకర్ సిబ్బంది బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిధులు రాబట్టిన ఘనత చంద్రబాబుదే

విశాలాంధ్ర-వేంపల్లి: కేంద్రప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుకే ఘనత దక్కుతుందని టీడీపీ నేత డాక్టర్ డివి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఏడాది బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి రూ. 15,000 కోట్లు, ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుకి అధిక నిధులు కేటాయింపు ,వైజాగ్-చెన్నై మరియు హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ లో గల కొప్పర్తి మరియు ఓర్వకల్ నోడులకు అధిక నిధులు కేటాయింపు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రగతికి అనుభవజ్ఞుడైన పాలకుడు అవసరాన్ని గుర్తించి ప్రజలు అద్భుతమైన రీతిలో పట్టం కట్టి నందుకు ప్రతిఫలం నేడు ఏపీ రాష్ట్రానికి కేంద్రం బడ్జెట్లో లభిస్తున్న ప్రాధాన్యతే తార్కాణం అని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రానికి నిధులు రాబట్టిన ఘనత చంద్రబాబుదే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని రంగాల అభివృద్ధికి కేంద్రం నుండి భారీగా నిధులు రాబట్టిన ఘనత అపర చాణక్యుడు ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు దక్కిందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి కొనియాడారు. బుధవారం పాత్రికేయులతో మాట్లాడుతూ చంద్రబాబు అహర్నిశలు చేసిన కృషితో ప్రధాని దామోదర దాస్ నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ కు పెద్ద పీట వేశారన్నారు. 2024-25 కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు 15 వేల కోట్ల ఆర్థిక సహాయం లభించిందన్నారు. సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ఎన్డీయే కూటమికి ఓట్లు కుమ్మరిస్తే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ లో వరాల వాన కురిపించారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్ డి ఎ కూటమి చేస్తున్న కృషితోనే కేంద్ర ప్రభుత్వం సాను కూలంగా స్పందించిందన్నారు. కష్టకాలంలో చంద్రబాబు కేంద్రం నుండి నిధులు తీసుకురావడం గొప్ప విషయం అన్నారు. ఇక అభివృద్ధి లో నియోజకవర్గం పరుగులు పెడుతుందన్నారు. చంద్రబాబు తన చాకచక్యంగా మేధాశక్తి తో ఆంధ్రప్రదేశ్‌కు భారీ ఎత్తున నిదులు తెచ్చా రన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, వ్యవసాయ అభివృద్ధికి, నిరుద్యోగ యువతకు మహర్దశ వచ్చిందన్నారు. రాష్ట్ర విభజన తరువాత గత 5 సంవత్సరాలు వైసిపి పాలనలో ఆర్థికంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ని గట్టెక్కించేలా బడ్జెట్‌లో నిధులు వచ్చే విధంగా చంద్రబాబు చేసిన కృషిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరవలేన్నారు. అమరావతికి మంచి రోజులు వచ్చాయన్నారు.

తపాలా శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటి టౌన్: తపాలా శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్స్పెక్టర్ అమర్నాథ్ తెలియజేశారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా రాయచోటి డివిజన్ శిబ్యాల గ్రామం సబ్ పోస్ట్ ఆఫీస్ లో బుధవారం పోస్టల్ ఇన్స్పెక్టర్ అమర్నాథ్ ఆధ్వ ర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ పోస్టల్ సేవలు, పొదుపు, బీమా సేవలను సద్వి నియోగం చేసుకుంటే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ఏర్పడుతుం దన్నారు. తపాలా శాఖలోని పొదుపు, ఇన్సూరెన్స్ పథకాల గుర్చి గ్రామ ప్రజలందరికీ ఆయన అవగాహన కల్పించారు. పోస్టల్ డిపార్ట్మెంట్ కు సంబం ధించి పొందే సేవల పట్ల ఏవైనా సమాచారం కోసం తపాలా శాఖ కార్యాలయంలో సంప్రదించి తగిన సమాచారం పొందవచ్చని తెలిపారు. ప్రజలకు ఉపయోగ కరంగా ఎన్నో సేవలను తపాలా శాఖ అందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోస్టాఫీసు సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులు కునా కృష్ణదేవరాయలు, సుదర్శన్ హాజరయ్యారు.

ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని విజయవాడలో హైదరాబాద్ నోయెల్ ఫార్మా యండి సర్వేపల్లి వెంకటయ్య, గౌతమి విద్యాసంస్థల అధినేత నాగూర్లు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి బొకే అందించారు. ఈ కార్యక్రమంలో పగిడాల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సమావేశాలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, సరస్వతి విద్యామందిరం బుధవారం సీజనల్ వ్యాధులు మరియు స్టాప్ డయేరియా గురించి విద్యార్థులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం జూన్ నుండి నవంబర్ వరకు వర్షాకాలం కావున నీరు నిల్వ ఉండటం వలన దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయని, వాటి వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాలు మొదలగు వ్యాధులు వస్తాయని, దోమల వ్యాప్తిని అరికట్టాలంటే దోమలు పుట్టకుండా ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి అన్ని నీటి నిల్వలను, పాత్రలను, శుభ్రపరిచి ఆరిన తర్వాత నీరు నింపుకోవాలని, నీటిలో ఉన్న లార్వాను పారవేయించాలని, నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, పనికిరాని తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలు మొదలగు వాటిని లేకుండా చేసుకోవాలని, దోమల బెడద నుండి రక్షణ పొందుటకు దోమతెరలు వాడాలని, జ్వరం వస్తే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేసుకొని తగిన చికిత్స తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అలాగే డా. శివప్రసాద్ రెడ్డి డయేరియా గురించి మాట్లాడుతూ పిల్లలలో బేదులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తూ, పరిశుభ్రమైన నీటిని తాగాలని, అన్ని రకాల ఆహార పదార్థాలపైన ఈగలు వాలకుండా మూతలు పెట్టుకోవాలని, బజారులో అమ్మే పానీపూరి లాంటి తినకూడదని అన్నారు. పిల్లలలో డయేరియా ఉందేమో గుర్తించి వారికి ఓఆర్ఎస్ మరియు జింక్ మాత్రలు వాడాలని, డయేరియా కేసులు ఎక్కువగా ఉంటే దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లాలని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు బేదులు వస్తే మా సిబ్బందికి చెప్పాలని, తినే ప్రతిసారి చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. హిమబిందు, డా. అలీమ్, ప్రధానోపాధ్యాయులు గుర్రప్ప, శ్రీనివాసులు, డిపిఎంఓ శివశంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, నూర్ బాష, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజార్‌ను వినియోగలోకి తీసుకురావాలి

విశాలాంధ్ర-వేంపల్లి: వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన రైతు బజార్ ను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ స్థానిక బీజేపీ నాయకులతో కలసి రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ రుచితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరుగాలం కష్టపడిన రైతు తను పండించిన పంటను దళారులకు కాకుండా నేరుగా వినియోగదారులకు అమ్మకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లను నిర్మించింది అని చెప్పారు అటువంటి రైతు బజార్ గురించి రైతులకు వివరించి వారు ఇక్కడికి వచ్చి పంటను అమ్ముకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ రైతులకోసం దేశవ్యాప్తంగా 125000 వేల కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మన రాష్ట్రం లో ఉన్న 4688 ఎరువుల దుకాణాలను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా మార్చడం జరిగిందని అన్నారు. నాటి ప్రధాని రాజీవ్ గాంధీ కేంద్రం నుండి ఒక రూపాయి విడుదల చేస్తే లబ్ధి దారునికి చేరేది 15 పైసలు మాత్రమే అని చెప్పేవారు కానినేడు రైతు సంక్షేమమే ధ్యేయం కేంద్ర ప్రభుత్వం రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా పెట్టుబడి సాయం క్రింద ఏటా ఆరు వేల రూపాయలు నేరుగా వారి ఖాతాలో జమ అవుతోందని చెప్పారు. రైతుల కోసం కిసాన్ క్రెడిట్ కార్డ్, ప్రధాన మంత్రి పసల్ భీమా యోజన, కృషి సంచాయ్ యోజన, ప్రధాన మంత్రి కుసుమ్ యొజన అనేక పథకాలు ప్రవేశపెట్టి వ్యవసాయం దండగ కాదు పండుగ అని నిరూపించిన వ్యక్తి నరేంద్రమోడీ అని అన్నారు. గత ప్రభుత్వం రైతంగానికి ఎటువంటి సాయం చేయకుండా నిర్వీర్యం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి సుస్మా, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముద్ది శివకృష్ణ, మునగాల ప్రసాద్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సురేష్, కే సురేష్, సుబ్బయ్య దొంతు సుమన్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుకు బీజేపీ పక్షాన 'ఆది' మద్దతు

- మాజీ సీఎంపై ఎమ్మెల్యే చదిపిరాళ్ల విసుర్లు

- కర్షకులను ఇబ్బందుల్లోకి నెట్టేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రెండు కీలక బిల్లులను శాసనసభ ముందుకు తీసుకువచ్చింది. కీలకమైన ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని (ల్యాండ్ టైటిలింగ్ యాక్టు-2022) రద్దుకు బీజేపీ పక్షాన ఆ పార్టీకి చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సభలో మాట్లాడుతూ అమరావతి రాజ ధానికి భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం చేయాలన్న తలంపుతో, రాష్ట్ర రైతాంగాన్ని ఇబ్బందుల్లోకి నెట్టాలన్న ఉద్దేశ్యంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమలుకు ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే ఆది మండిపడ్డారు. ప్రతిచోటా ఆయన ఫోటో ఉండాలని జగన్ పరితపించారని ఎద్దేవా చేశారు. దేవాదాయ, వక్ఫ్‌బోర్డు భూములను సైతం గత వైసీపీ పాలకులు వదిలిపెట్టలేదని ఎమ్మెల్యే ఆది సభలో ప్రస్తావించారు. భూసేకరణ, భూ సమీకరణ ఉండకూడదని ఆ భూములను తాకట్టు పెట్టి రుణాలు తెచ్చి రాష్ట్రాన్ని తగలబెట్టాలన్న ఉద్దేశ్యంతో వైసీపీ పాలన సాగిందని ఆది సభలో ఆరోపించారు. ఈ యాక్టును రద్దు చేస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు ఆ మేరకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే యాక్టు ప్రతులను చించి వేశా రని సభలో ఎమ్మెల్యే ఆది గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సభకు రప్పించాలని ఆ అధికా రం సభాపతిగా తమరికి ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడుని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కోరారు. ఎమ్మెల్యే శాసనసభలో మాజీ సీఎం జగన్‌పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన అరకటవేముల హరినారాయణ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను విజయవాడలోని ఆయన నివాసం నందు బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషన్ రెడ్డితో కలిసి హరినారాయణ బీజేపీలో చేరిన తర్వాత మొదటి సారి కలిశారు. చదువుకునే సమయంలోనే ఆర్ఎస్ఎస్ నందు పనిచేసిన విశయాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ సంధర్భంగా మంత్రి సత్యకుమార్‌ను ఆయన శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. రాబోవు రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని హరి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషన్ రెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ కో కన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్, స్టేట్ కల్చరల్స్ కన్వీనర్ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: బేడ బుడగ జంగాలను ఎస్సీ కుల వర్గీకరణలో చేర్చడం కోసం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు కడప జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ కోనేటి ప్రదీప్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. స్థానిక విజయవాడలో మంత్రి సత్యకుమార్‌ను బుధవారం ఆయన నివాసంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషన్ రెడ్డితో కలిశారు. ఈ కలయిక ముఖ్య ఉద్దేశం బేడ బుడగజంగాలు పూర్వం ఎస్సి కుల ధృవీకరణ పత్రం కిందే ఉండేవారు కానీ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత బుడగ జండాల వారు ఆంధ్ర ప్రాంతంలో లేరని వారికి ఎస్సీ కుల ధృవీకరణ పత్రము ఇవ్వడం లేదని దాని తిరిగి అమలు చేసి కేంద్ర ప్రభుత్వ స్థాయిలో దీన్ని దృష్టికి తీసుకొని వెళ్లాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : పట్టణంలోని ఉజ్వల స్కూల్ వెనుక భాగాన 35 సంవత్సరాల శేఖర్ అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. మృతుడు కర్నూల్ జిల్లా ఆత్మకూరుకు చెందినవాడని, పోరుమామిళ్ల బలిజకోటలో వివాహం చేసుకొన్నట్లు, ప్రస్తుతం భార్యకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. పోలీసుల జోక్యంతో మృత దేహాన్ని పోస్టుమార్టం కొరకు పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రత్యేక కౌంటర్లకు ఆదరణ

విశాలాంధ్ర–యర్రగుంట్ల : బహిరంగ మార్కెట్‌లో నిత్యా వసరా ల ధరలు పెరిగిపోవడం తో సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలు ధరలను అదుపులోకి తీసుకువచ్చేందుకు వీలుగా తగ్గింపు ధరలకు కందిపప్పు, బియ్యం అందుబాటులోకి తీసుకురావడంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన కనిపిస్తోంది. జమ్మలమడుగు నియోజకవర్గంలోని జమ్మలమడుగు, ఎర్రగుంట్ల పురపాలికలో 4, మండల కేంద్రమైన ముద్దనూరులో 2 చొప్పున ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించారు. ఆయా ప్రత్యేక కౌంటర్లకు ఆదరణ లభిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇటు కందిపప్పు, బియ్యం ధరలు కూడా పెరిగి సామాన్యులకు భారంగా మారింది. దీంతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యం మిల్లర్లతో మాట్లాడి తక్కువ ధరలకు బియ్యం విక్రయాలు జరిగేలా చూస్తున్నారు. అదేవిధంగా కందిపప్పు కూడా హోల్‌సేల్ వ్యాపారులతో మాట్లాడిన అధికారులు కందిపప్పు కిలో రూ.160 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక బియ్యం విషయానికి బిపిటి సన్నాలు (స్టీమ్) బియ్యం కిలో రూ.49కి అమ్ముతున్నారు. బిపిటి సోనా మసూరి (ముడ బియ్యం) కిలో రూ.48గా నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రచారం చేయగా వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ నెల 19 నుంచి వీటి అమ్మకాలు సాగిస్తున్నారు. ఫలితంగా ప్రత్యేక కౌంటర్లకు మంచి గిరాకీ ఏర్పడింది. వినియోగదారుల కు ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా వీటి విక్రయాలు చేపడు తున్నారు. దీంతో జనం బియ్యం, కందిపప్పు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఘనంగా అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర–ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక రామేశ్వరం బాల బాలికల గ్రంథాల యంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు పద్మ శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కడప జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, రిటైర్డ్ హెడ్మాస్టర్ రాజశేఖర్ రాజులు హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులన్నారు. పత్రికా సంపాదకునిగా గ్రంధాల య సర్వస్వం అనే పత్రికను స్థాపించారన్నారు. రాజశేఖర్ రాజు మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య తూర్పుగోదావరి జిల్లా కొంకుదూరు గ్రామంలో జన్మించిన వీరు గ్రంధాలయ ధ్యమాన్ని విప్లవ కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు. అనేక గ్రంధాల యాలను స్థాపించి పద్మ శ్రీ పురస్కారం అందుకున్నారన్నారు. 1916లో ఆంధ్ర సాహిత్య పత్రికను స్థాపించి రాయప్రోలు, శ్రీశ్రీ రచనలను ప్రచురించి ప్రజలలో చైతన్యం కల్పించిన మహాను భావుడు అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వైమానిక దళ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటకొండయ్య, గ్రంధాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, రవిబాబు, శ్రీనివాసుల రెడ్డి, విధ్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటన బాధ్యులకు చట్టపరమైన శిక్ష తప్పదు

విశాలాంధ్ర–కడప కార్పొరేషన్ : పుంగనూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదం కాదని పెద్దిరెడ్డి భూధం దాల పుట్ట అని కడప నగర టిడిపి ఉపాధ్యక్షులు కొండ సుబ్బ య్య అన్నారు. ఆయన మీడియా తో మాట్లాడుతూ పుంగనూరు లో పుడింగి అని చెప్పుకునే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తమ తనయుడు మిథున్ రెడ్డి పాపాల మూట తప్ప మరొకటి కాదన్నారు. మీరు ఎంత మంట పెట్టిన మీ పాపాలు పండే రోజు దగ్గరలో ఉందన్నారు. తండ్రి కొడుకులు జైలుకుపోయేం దుకు మానసికంగా మీరు తయారయ్యారని ప్రజలందరూ అనుకుంటున్నారని తెలిపారు కనుక తప్పులు ఒప్పుకొని కోర్టులో మీరే మీరే లొంగిపోతే మీకే మంచిదని అన్నారు.

ప్రజలను మభ్యపెట్టే అంకెల గారడి బడ్జెట్

విశాలాంధ్ర–కడప కార్పొరేషన్ : కేంద్రం ప్రవేశపెట్టిన 2024/25 వార్షిక బడ్జెట్ మన రాష్ట్రానికి రాజధానికి సంబంధించి 15 వేల కోట్లు ఏదైతే కేటాయించారో అది ఏ విధంగా కేటాయించారో స్పష్టత లేకుండా ఉందని ప్రముఖ విద్యావేత్త, కడప కాంగ్రెస్ పార్లమెంటరీ ఇన్చార్జి సయ్యద్ గౌస్ పీర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రాష్ట్రానికి అప్పుగా చేస్తున్నారా, ఒకవేళ అప్పుగా ఇస్తే అప్పు ఎవరు తీర్చాలి రాష్ట్ర ప్రభుత్వానికి అంత స్తోమత ఉందా అని ప్రశ్నించారు. ఇదేమి స్పష్టంగా చెప్పకుండా కేవలం 15 వేల కోట్లు ప్రకటించి వాళ్లకు వాళ్లే హర్షించుకుంటున్నారాని తెలిపారు. ఇది కేవలం ప్రజలను మభ్యపెట్టే అంకెల గారడి తప్ప మరి ఏది కాదని రాష్ట్ర అభివృద్ధికి ప్రయోజనాలకు ఏ విధంగా ఉపయోగ పడదని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.కేంద్ర కూటమి ప్రభుత్వంలో కీలక నేతగా ఉన్న మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయో జనాల కోసం ఈ వార్షిక బడ్జెట్లో నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. గతంలో టిడిపి ప్రతిపక్షంలో ఉండగా మేం అధికారంలో వస్తే ప్రత్యేక హోదా ను రాబడతామని అధికారం వచ్చిన తర్వాత హామీలు గాలికి వదిలేసారని దీనివల్ల తీవ్రంగా నష్టపోయేది ప్రజలేనని ప్రత్యేక హోదా ఆంధ్ర రాష్ట్రానికి చాలా కీలకమని కొత్తగా పరిశ్రమలు పెట్టుబడులు నిరుద్యోగ యువతకు మెండుగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక హోదా మీద దృష్టి సారించాలని ఆయన వెల్లడించారు.

వివాద భూమిని సర్వే చేసిన అధికారులు

విశాలాంధ్ర – సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని బుర్రల దీన్నెపల్లెలో గ్రామకంఠం ఆక్రమించి గోడ కట్టారని స్థానికులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుండి పలువురు జిల్లా మండల అధికారులకు నోటీసులు రావడంతో జిల్లా సర్వేర్ జయరాజ్ బుధవారం వివాదాస్పద స్థలాన్ని బుధవారం పరిశీలించారు. స్థానిక రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్థలాన్ని సర్వే నిర్వహిం చారు. అయితే తిరిగి శుక్రవారం సర్వే చేసి వివాదాస్ప దంగా మారిన స్థలం ప్రభుత్వ భూమిలో ఉందా పట్టా భూమిలో ఉందా అనే విషయాన్ని సర్వే చేసి చెబుతామన్నారు. డిఐఓ బాలాజీ, ఐఓఎస్ ప్రసాద్ రావు, తహసిల్దార్ జరీనా బేగం, సబ్ ఇన్స్పెక్టర్ ఎస్.కె.ఎం హుస్సేన్, మండల సర్వేయర్ రక్షిత,ఆర్ ఐ రాంబాబు రెవెన్యూ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారు

విశాలాంధ్ర–ప్రొద్దుటూరు: వైఎంఆర్ కాలనీలోని ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఇంటి ముందు ర్యాంపులు అడ్డంగా ఉన్నాయంటూ తొలగించేందుకు వచ్చిన ఏసీపీ మునిరత్నంపై ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం ఏసీపీ మునిరత్నం జేసీబీతో నేరుగా ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఇంటి వద్దకు వచ్చి ర్యాంపులు తొలగించే కార్యక్రమం చేపట్టడంతో ప్రవీణ్‌రెడ్డి ఏసీపీతో ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ప్రొద్దుటూరు మున్సిపాల్టీలో మున్సిపల్ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తే పట్టించుకోని ఏసీపీ మా ఇంటి వద్దకు వచ్చి ర్యాంపులు పగులగొడ్తావా అంటూ ఈ విశయంపై మున్సిపల్ కమీషనర్‌కు మరియు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

అనుమతి లేని లేఔట్‌లకు నోటీసులు

విశాలాంధ్ర–పోరుమామిళ్ళ రూరల్ : మండలంలోని రంగ సముద్రం పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా వేసిన లేఔట్‌ల కు నోటీసులు జారీ చేసినట్లు మండల పంచాయతీ విస్తరణ అధికారి, పంచాయతీ కార్యదర్శి రాజీవ్ రెడ్డి తెలిపారు. పంచాయతీ పరిధిలో 100కి పైగా ఎకరాల విస్తీర్ణంలో 14కి పైగా లేఔట్లు అనుమతి లేకుండా వేశారని చెప్పారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతులు లేకుండా వేసిన లేఔట్‌లపై చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా ఆయా లేఔట్‌ల యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు. అందుబాటులో ఉన్నవారికి స్వయంగా, కొందరికి వాట్సాప్ ద్వారా, కొన్నింటికి లేఔట్ వద్ద నోటీసులు అంటించామని చెప్పారు. ఈ లేఔట్ ప్లాట్స్ అమ్మకాలు, కొనుగోలు చేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. ఎవరైనా అనుమతులు లేకుండా లేఔట్ లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు రక్తదాన శిబిరం

విశాలాంధ్ర–ప్రొద్దుటూరు: కడప జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థలు మరియు నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త నాళం వారోత్సవాల్లో భాగంగా 26వ తేదిన(రేపు) శుక్రవారం నాడు పట్టణంలో వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేయడం జరుగుతుందని వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు 26వ తేదిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి జయప్రదం చేయాలని తెలిపారు. రక్త వారోత్సవాల కార్యక్రమంలో నగరంలో రక్తం కొరతను నిర్మూలించే దిశగా వెళ్తున్నామని ఈ కార్యక్రమం జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. వివరాలకు 91541 95061, 96424 71600 రక్తదాతలు ఈ నంబర్లకు సంప్రదించాలనా కోరారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర– రామాపురం : గ్రామాలలో ఉన్న స్వయం సహాయక సంఘాలు బలోపేతానికి అందరు కృషి చేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారుమండల కేంద్రంలో స్వయం సహాయక కార్యాలయంలో బుధవారం మండలానికి చెందిన ఎంఎస్ ఓ వీలు సమావేశంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న స్వయం సహాయక గ్రూపులను బలోపేతం చేయా లని వారి అవసరాలు నిమిత్తం బ్యాంకులోను శ్రీనిధి లోన్లను వ్యక్తిగత రుణాలను వంటివి ఇప్పించడం లో సీసీలు కీలకపాత్ర వహించాలని చెప్పారు గ్రామాలలో నియమించిన వివో ఏలు సంఘము వద్దకు పోయి వార్ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారా లేదా అన్న విషయాలను పుస్తకాలను కచ్చితంగా పొందు పరచాలనిచెప్పారు ఎక్కడైనా గ్రూపులు రుణాలు తీసుకొని తిరిగి చెల్లంచక పోయిన ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డబ్బులు తిరిగి చెల్లించే విధంగా ఏర్పాటు చేసుకోవాలి అన్నారు గ్రామ సంఘాల సమావేశం ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత విఓ పాటు సీసీలు కూడా తప్పకుండా హాజరు కావాలని వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించా లని సూచించారు ప్రభుత్వం నుంచి స్వయం సహాయక గ్రూపులో ఇన్సూరెన్స్ వంటివి కచ్చితంగా గ్రూప్ సభ్యులకు అందేటట్లు చూడాలని ఆయన తెలిపారు ప్రతి వివో ఏ సైనికుల్లాగా పని చేయాలి అన్నారు ఈ కార్యక్రమంలో సిసిలు నాగభూషణ్ రెడ్డి శ్రీనివాసులు నరసింహులు నాగరాజు ఆదినారాయణ ప్రసాద్ ఎంఎస్ అకౌంటెంట్ మండలానికి చెందిన ఎంఎస్ఓ వివో బీ లు పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర–తొండూరు: డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బోడివారిపల్లె గ్రామం లో జరుగు తున్న వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ,చికెన్ గుని యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వస్తా యని, ఈ వ్యాధులు రాకుండా ఉండాలంటే పనికిరా ని గుంతలను లోతట్టు ప్రదేశాలను వాడని బావులను పూడ్చి నీరు నిల్వ కాకుండా చూడాలన్నారు. చెత్తాచెదా రం మురుగు కాల్వల్లో చేరకుండా ఏర్పాటు చేయటం. కంప చెట్లను పిచ్చి మొక్కలను తొలగించడం. మరుగు దొడ్ల గాలి గొట్టాలకు మేష్ కట్టించటం. పెంట కుప్పలను చెత్తా చెదారాన్ని తరచూ తొలగిస్తూ పరిసరాల పారిశుధ్యం పాటిం చటం, ఇండ్ల లో ఆవ రణలోని పనికిరాని వస్తు వులను పరిశీలించి నీరు నిలవ కుండా వాటి తొల గించ డం. ఇండ్ల లో మీరు నింపుకునే పాత్రల ను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మళ్లీ నింపుకునేలా చూడాల న్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడటం లాంటి జాగ్రత్తలు తీసుకుంటే దోమల వృద్ధిని అరికట్ట వచ్చని, తెలిపా రు. ఈ కార్యక్రమంలో పులివెందల డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాజా మొద్దీన్. తొండూ రు వైద్యాధికారి డాక్టర్ ఆరిఫుల్లా. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి. సబ్ యూనిట్ అధికారి. సిద్దయ్య, నరేష్. హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య. సూపర్వైజర్ శశికళ. సి.హెచ్.ఓ లు. కార్యకర్తలు పాల్గొన్నారు.

భూవివాదాల సమస్యలను స్వీకరించనున్న స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

విశాలాంధ్ర-మదనపల్లి : అన్నమయ్య జిల్లా, మదనపల్లికి విచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి. సిసోడియా, ఐఏఎస్, మదనపల్లి సబ్ డివిజన్ కు సంబంధించిన భూ వివాదాల సమస్యలను స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 25వ తేది గురువారం సాయంత్రం 4 గంటల నుండి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. మదనపల్లె సబ్ డివిజన్ లోని 11 మండలాలకు సంబంధించి గత 2 నుంచి 3 సంవత్సరాల భూ వివాదాల సమస్యలను బాధితులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) కు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-మదనపల్లె: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ ను పెంపొందించు కోవాలని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. బుధవారం డిప్లొమా చేసి ఇంజినీరింగ్ రెండవ సంవత్సరములో చేరిన విద్యార్థులకు తరగతులను ప్రిన్సిపాల్ రామనాథన్, అడ్వైసర్ ఆర్&డి డాక్టర్ తులసీరామ్ నాయుడు మరియు విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ కళాశాల లో చేరిన విద్యార్థులను మరియు తమపై ఉన్న నమ్మకంతో తమ పిల్లలను ఇక్కడ చేర్పిన తల్లిదండ్రులకు కృతతలు తెలియజేసారు. తమ కళాశాలలో అధ్యాపకులు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు ప్రపంచ ప్రఖ్యాత గాంచిన యూనివర్సిటీ ల సంబంధించిన వారు మా కళాశాల లో ఉన్నారని, నాణ్యత మైన విద్య ను విద్యార్థులకు అందిస్తామని ఆయన అన్నారు. కళాశాల లోని విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్న్‌షిప్ లను అందజేస్తున్నామని, బి.టెక్ కోర్స్ పూర్తి అయిన తరువాత ఎం.ఎస్ కూడా విద్యార్థులకు అందిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థులు పరిశోధన రంగం లో రాణించాలని ఆయన అన్నారు. విద్యార్థులు పరిశోధన రంగం లో రాణించాలని, ఇంటర్ డిసిప్లైనరీ పరిశోధనలపై దృష్టి సాధించాలని ఆయన అన్నారు. మా కళాశాలకు యెన్.బి.ఎ మరియు నాక్ %ూ%ం అక్రిడిటేషన్ లు ఉన్నాయని అన్నారు. విద్యార్థులు కళాశాలలో గల ల్యాబ్, లైబ్రరీ, ఇన్నోవేషన్ సెల్, మొదలైన వాటిని సకాలంలో వాడుకోవాలని ఆయన అన్నారు.

వ్యాధులు నియంత్రణ సాధ్యమే:డాక్టర్:రమేష్ రెడ్డి

విశాలాంధ్ర- పీలేరు :- నియంత్రనే తప్ప పూర్తిగా నయం కాని జీవనశైలి వ్యాధుల్లో మధుమేహం వ్యాధి ఒకటని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం గండ్లపల్లి గ్రామములో మధుమేహం - జాగ్రత్తలు అంశముపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శరీరములో తగినంత ఇన్సులిన్ ను ఉత్పత్తి చేయక పోవడం వల్ల రక్తములో చెక్కర స్థాయి ప్రతికూలత గల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యకు కొన్ని మంచి అలవాట్లు అలవర్చుకుంటే తప్ప ఆరోగ్యంగా జీవించలేమని,దూమ మధ్యపానాలకు,అధిక వత్తిడికి, తీపి పదార్థాలకు దూరంగా ఉండాలని, సమయానికి మందులు తింటూ,నిత్యం వ్యాయామం చేయాలని,తాజా ఆకు,కాయగూరలతో మితాహారం భుజించాలని,లేనిచో వ్యాధి తీవ్రత అధికమై అంధత్వం,మూత్రపిండాల వైఫల్యం,గుండె,నరాలు మొదలగు అవయవాలపై చెడు ప్రభావాలు వుంటాయని డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు.కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య,ఏయన్ యం రేణుక,సిహెచ్ఓ రాజేశ్వరి,వెకటరత్నం,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నేత గిరి నాయుడుపై కాల్పుల కలకలం

విశాలాంధ్ర-పీలేరు:- టిడిపి నేత కావలి పల్లె క్లస్టర్ ఇంచార్జ్ గిరి నాయుడు పై తుపాకీతో గుర్తుతెలియని దుండగులు హత్యాయత్నం చేయడం ఘటన పీలేరులో సంచలనం రేకెత్తించింది.గతంలో కూడా గిరి నాయుడు పై ఆయన ప్రత్యర్థులు దాడులు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గిరి నాయుడు ఇంట్లో ఉండగా కొంతమంది మాస్కులు ధరించి ఇంటిలోనికి చొరబడి ఆయనపై తుపాకీతో కాల్చడంతో ఆ తుపాకీ పని చేయకపోవడంతో గిరినాయుడు పెద్ద ఎత్తున అరుపులు అరుస్తూ బయటికి రావడంతో దుండగులు పారిపోయారు. అయితే ఇది కక్ష సాధింప లేదా రాజకీయ సాధింప అనే కోణంలో పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ నేపథ్యంలోబుధవారం అన్నమయ్య జిల్లా డియస్ పీ.రామచంద్రా రావు పీలేరుకు చేరుకొని గిరి నాయుడు కు జరిగిన సంఘటన పై ఆరా తీశారు. డి యస్ పీ. వెంట పీలేరు అర్బన్ సీఐ. మోహన్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో జిల్లా అధికారి

విశాలాంధ్ర-మదనపల్లె : జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి గుర్రంకొండ మండలం జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ని పరిశీలించి తగి సూచనలు జారీ చేయడమైనది. ఇందులో భాగంగా తరిగొండ గ్రామపంచాయతీని సందర్శించి అందులోని ఎస్ డబ్ల్యు పీ ఆర్ షెడ్డును సందర్శించి మండలంలోని అన్ని ఎస్ షెడ్లు వాడుకలోకి తేవాలని చెత్త నుంచి సంపదను రాబట్టే విధంగా అందరూ పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని సూచించడం జరిగింది. అదేవిధంగా గ్రామపంచాయతీ నందు ఉన్న ఇందిరమ్మ కాలనీ నందు జరుగుతున్న శానిటేషన్ డ్రైవ్ ని సందర్శించి శానిటేషన్ బాగుంటే ప్రస్తుత పరిస్థితి లో వైరల్ ఫీవర్స్ రాకుండా కట్టడి చేయచ్చు అని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుర్రంకొండ మండలం ఇన్చార్జి ఈ ఓ పి ఆర్ డి అబ్దుల్ సుకూర్ మరియు గుర్రంకొండ గ్రామ పంచాయతీఈ ఓ. విశ్వనాథ్ పాల్గొనడం జరిగింది.

వరి నారుమడి యాజమాన్యం పద్ధతులలో మెలుకువలు

విశాలాంధ్ర - మైదుకూరు : వరి నారుమడి యాజమాన్యం పద్ధతులను మండల వ్యవసాయ అధికారి పి ప్రసన్న మరియు ఏ డి ఏ కృష్ణమూర్తి వరి నారుమడి లను సందర్శించి ఆదిరెడ్డిపల్లి గ్రామంలో రైతులకు అవగాహన తెలియజేయడమైనది. వరి నారుమడులలో బాగా చివికిన పశువుల పేడను వాడాలి నారుమడి చెల్లిన 10 రోజుల తర్వాత ఒక కేజీ యూరియా ఒక కేజీ డీఏపీ మరియు ఒక కేజీ ఎంఓపిలను చెల్లి ఆరోగ్యవంతమైన నారును పెంచాలి కలుపు మొక్కలు లేకుండా నివారించాలి నారు పీకడానికి వారం రోజుల ముందర కార్బోఫ్యూరాన్ 3జీ గ్రాన్యుల్స్ ఒక కేజీ ఐదు సెంట్ల నారుమడిలో వేయాలి దీనివలన ముఖ్యంగా కాండం తొలిచేపురుగు అరికట్టబడుతుంది అలాగే నీటి యాజమాన్యం గురించి రైతులకు వివరించడం జరిగింది.

జాతరను ప్రశాంతంగా నిర్వహించాలి:ఎస్సై

విశాలాంధ్ర-కడప : సిద్దవటం మండలం మాధవరం లో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా ఆనందోత్సవాలతో పండుగను జరుపుకోవాలని ఎస్సై పెద్ద ఓబన్న ఆలయ ఆలయ కమిటీ సభ్యులకు నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి గొడవలు పాలు పడితే వారిపై కఠిన చర్యలు తప్పవు ఉన్నారు.

చంద్రబాబు కృషితోనే రాష్ట్రానికి ప్రత్యేక నిధులు

మండల టిడిపి నాయకులు నందగోపాల్ రెడ్డి

విశాలాంధ్ర-కడప : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి సంప్రదింపుల ఫలితంగానే ఎన్నో ఏళ్ల తర్వాత రాష్ట్రానికి కేంద్రం బడ్జెట్లోనే ప్రత్యేక నిధుల కేటాయింపులు జరిగాయని అట్లూరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బోవిల్ల. నందగోపాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల సీఎంగా జగన్మోహన్ రెడ్డి చూపిన అసమర్ధతకు చంద్రబాబు అనుభవం ముందు చూపుకు ఇదే నిదర్శనం అన్నారు. కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టడంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని కేంద్రంలో పదవుల కన్నా రాష్ట్ర అభివృద్ధి మాత్రమే ముఖ్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలకు అర్థం కూడా ఇప్పుడు అందరి కి అర్థం అవుతుందని సంతోషం వ్యక్తం చేశారు. 40 రోజుల వ్యవధిలోనే వచ్చిన కేంద్ర బడ్జెట్ నుంచి అమరావతి పోలవరం ప్రాజెక్టుకు నిధులతో పాటు వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ పారిశ్రామికవాడ అభివృద్ధికి తోడ్పాటు సాధించడం అభివృద్ధి పై తనకున్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఐదు సంవత్సరాల తర్వాత కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ప్రత్యేకమైన గుర్తింపు లభించడం సంతోషమన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులు

అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర- పీలేరు : పీలేరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ శాఖధికారి అమరనాథ్ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులు, గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటర మణయ్య జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాటలాడుతు 1934-1948 మధ్య అనేక గ్రంథాలయాలు అయ్యంకి వెంకటరమణ అయ్యగారు ఏర్పాటు చేశారని అన్నారు..1992 గ్రంథాలయాలపై చేసినటువంటి సేవలు గాను ఆయనకు పద్మశ్రీ పురస్కారం పొందారు. శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యకి గ్రంథాలయ పితామహా గ్రంథాలయ సరస్వతి, గ్రంథాలయ విశారద ఇలాంటి బిరుదులు అన్నీ కూడా పొందారు. తను 19వ ఏట నుంచి ప్రజాసేవకు గ్రంథాలయాల అభివృద్ధికి తను సేవ చేయడానికి పూనుకున్నారని తెలిపారు. 1910 ఆంధ్ర సాహిత్య సభను నిర్వహించారు. 1914 ఆంధ్ర రాష్ట్ర సదస్సును నిర్వహించారు. 1919 నవంబర్ 14న చెన్నైలో అఖిల భారత గ్రంథాలయ సభను నిర్వహించారు. అప్పటినుంచి భారతదేశ మొత్తం కూడా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.శ్రీ అయ్యంకి వెంకటరమణ గారు గ్రంథాలయ అభివృద్ధికి చేసినటువంటి కృషి సేవలు గ్రంథాలయ అధికారి,మరియు పాఠకులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుపై బిజెపి హర్షం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్రానికి 2024-25 కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు భారీ ఎత్తున నిదులు కేటాయింపుపై బిజెపి కార్యవర్గ సభ్యులు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, మండల జనరల్ సెక్రటరీ సాయం శ్రీధర్, కుంభకోణం సాయి ఆచారి, దరిశా వెంకటరెడ్డి, పెయ్యల సుబ్రమణ్యం,విజయ్ కుమార్, మావిళ్ల బాలసుబ్రమణ్యం తదితరులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బీజేపీ పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపి, బిజెపి, జనసేన కూటమి కృషితో ప్రధాని దామోదర దాస్ నరేంద్ర మోదీ అధ్వర్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అమరావతి రాజధాని నిర్మాణానికి 15000 వేల కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. ముద్రలోన్లు 10 లక్షల నుండి 20 లక్షల వరకు పెంచారన్నారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయినటువంటి పోలవరం ప్రాజెక్టుకు మహర్దశ వచ్చిందన్నారు. వైసిపి పాలకులు చేసిన తీవ్రమైన ఆర్థిక నేరాలను కప్పిపుచ్చుకోవడానికి ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం అబాసుపాలైందని విమర్శించారు.

ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-రామసముద్రం : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం తిరుపతి అరవింద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది 175 మంది పరీక్షలు చేయించుకోగా 45 మంది కంటి శస్త్ర చికిత్సకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు వాసవి వనిత క్లబ్ ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించారు కార్యక్రమంలో డాక్టర్ అర్చన స్థానిక మెడికల్ ఆఫీసర్ లీల వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పూర్ణిమ కార్యదర్శి శరణ్య కోశాధికారి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో నవ వధువు అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-మదనపల్లి : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె బాబు కాలనీ, వెంకటేశ్వర పురంలో వివాహిత అనుమానస్పదస్థితిలో మృతి చెందడం బుధవారం కలకలం రేపుతోంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశ్వర పురంలో ఉంటున్న శ్రీనివాసులు, ఉష దంపతుల కుమారుడు మణికంత, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రామ్ నగర్ కు చెందిన వెంకటరమణ, లక్ష్మీదేవి ల కుమార్తె సాయిప్రియ (20) లు ఆరు నెలలక్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లయినప్పటి నుంచి గొడవలు జరుగుతున్నా సర్దుకుపోతూ కాపురం చేస్తూనే వచ్చింది సాయిప్రియ. భర్త మణికంత దుర్వ్యసనాలకు బానిసైనప్పటికీ ప్రేమ వివాహం కావడంతో పుట్టింటికి వెళ్లలేక లోలోపలే మదనపడుతూ కష్టమైన కాపురాన్ని నెట్టుకొచ్చింది. మంగళవారం అర్ధరాత్రి భర్త కొట్టడంతో చనిపోయిందని అనుమానాలు ఉన్నాయని మృతురాలి తల్లి, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కమ్మికి ఉరేసు కున్నట్లు చిత్రీకరించి, మృత దేహం మెడకు చీరచుట్టారని, నా కూతురిని చంపేశారంటూ మృతురాలి తల్లి లక్ష్మీదేవి కన్నీరు మున్నీరుగా విలపిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఘటన సమాచారం అందుకున్న మదనపల్లె తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు మృతిరాలి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

కేంద్ర బడ్జెట్లో పెద్దపీట చంద్రబాబు సాధించిన ఘనతే

విశాలాంధ్ర- పీలేరు : ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర బడ్జెట్లో పెద్దపీట చంద్రబాబు సాధించిన ఘనతే నని తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు , పీలేరు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ , గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిశీలకులు మల్లారపు రవిప్రకాష్ నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఏడాది బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణానికి రూ. 15,000 కోట్లు, ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుకి అధిక నిధులు కేటాయింపు ,వైజాగ్ చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి అధిక నిధులు కేటాయింపు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రగతికి అనుభవజ్ఞుడైన పాలకుడు అవసరాన్ని గుర్తించి ప్రజలు అద్భుతమైన రీతిలో తెలుగుదేశం,జనసేన,బీజేపీ పార్టీల కలయిక కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభిరుద్ధి పథంలో నడుస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి

విశాలాంధ్ర-పీలేరు: కలికిరి మండలం కలికిరి పంచాయతీలో బాలికోన్నత పాఠశాల నందు 2023- 2024 సంవత్సరానికి గాను పదవ తరగతి నందు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలకు కలికిరి వాస్తవ్యులైన డాక్టర్ ప్రమీల రాజగోపాల్ రెడ్డి వారి తల్లీ పేరు మీద "కృష్ణమ్మ మెమోరియల్ మెరిట్ స్కాలర్షిప్ " ద్వారా 576 మార్కులు సాధించిన ఎం రుబీనా కు 25000 వేలు, 557 మార్కుల సాధించిన బి వెన్నెల కు 15000 వేలు , 556 మార్కుల సాధించిన టి సుప్రియ కు 10000 వేలు, కలికిరి గ్రామపంచాయతీ సర్పంచ్ ఎల్లయ్య మరియు కలికిరి మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి, ఎంఈఓ కరీముల్లా, ప్రధానోపాధ్యాయురాలు ఎన్ జయమ్మ వీరి ఆధ్వర్యంలో చెక్కు రూపంలో అందించడం జరిగింది. రెడ్డివారి యోగేష్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే సంవత్సరంలో భావితరాల భవిష్యత్తు కోసం చదువులు ప్రోత్సహించడం కోసం యోగేష్ రెడ్డి కూడా ఆర్థిక సహాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-రాయచోటి రూరల్ : రాష్ట్రంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను నూతన ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్ టిఏ)రాష్ట్ర బాధ్యులు రెడ్డి రమేష్, కొండూరు శ్రీనివాసరాజులు డిమాండ్ చేశారు. బుధవారం వారు ఎన్టిఏ నేతలతో కలిసి విజయవాడలో మాజీ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు ఏఎస్ రామకృష్ణ క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ని కలిసి పలు రకాల ఉపాధ్యాయ సమస్యలపై ప్రాతినిధ్యం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు అత్యంత ఇబ్బందికరంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.అలాగే 12 వ పిఆర్సి అమలయ్యేలోగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, 117 జీవోను రద్దు చేయాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. అదేవిధంగా ఎం టి ఎస్ ఉపాధ్యాయులకు రావాల్సిన 12 నెలల జీతభత్యాన్ని వెంటనే మంజూరు చేయాలని, ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక కంప్యూటర్ ఆపరేటర్ ను ఇవ్వాలని కోరారు.అలాగే నాడు-నేడు పనుల్లో జరిగిన కార్పొరేట్ అవకతవకలకు ప్రధానోపాధ్యాయులను బాధ్యులుగా చేయరాదని, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటిఎస్ ను అమలు చేయాలన్నారు. అంతేగాక ఇటీవల మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయులు తిరిగి మైదాన ప్రాంతానికి వచ్చేలా అనుమతించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపి ప్రభుత్వం ద్వారా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ రామకృష్ణను కోరినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ టి ఏ నాయకులు జయచంద్ర నాయుడు,భాస్కర్ నాయుడు,ఏబి రామకృష్ణంరాజు, నల్లమల రామాంజులు, కొండూరు మురళీమోహన రాజు, కులశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర -కడప: వల్లూరు మండల కేంద్రంలోని అన్ని పంచాయతీల్లోని పంచాయతీ కార్యదర్శులు పరిశుభ్రతపై శ్రద్ధ వహించినప్పుడు గ్రామాల్లో అభివృద్ధి కనబడుతుందని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులు పరిశుభ్రమైన తాగునీరు అందించుట గ్రామాల్లో ఉన్న ఉపరితల జలాశయాలు భూతల జలాశయాలు రోజువారి పారిశుధ్య పనులను నిర్వహిస్తూ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్, విస్తరణ అధికారి ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ మోజీబ్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ను సందర్శించిన జీవనజ్యోతి విద్యార్థులు

విశాలాంధ్ర-కడప వైవీయూ : రూరల్ ఇమ్మెర్షన్ ప్రోగ్రాంలో భాగంగా యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని ప్రొద్దుటూరు జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. విశ్వవిద్యాలయంలోని బొటానికల్ గార్డెన్, ఫైన్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, సైకాలజీ మ్యాథమెటిక్స్, ఆర్ట్స్ బ్లాక్ లోని పలు విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం గాంధీ పార్కులో విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రధాన చార్యులు ఆచార్య పుత్తా పద్మ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ సమాజ జీవనశైలి, సమాజ స్థితిగతులు స్థిరమైన అభివృద్ధి సాధించే ప్రక్రియలు, సరికొత్త వ్యూహాల గురించి ఎన్ఎస్ఎస్ 4, 7 యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ లలిత, డాక్టర్ సునీత, మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ రియాజున్నీసా అవగాహన కల్పించారు జీవనజ్యోతి పాఠశాల రామిరెడ్డి, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు పి.శ్రీరాములు జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు సునీత, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

విశాలాంధ్ర- కడప : సిద్దవటం మండలం వంతటిపల్లి గ్రామపంచాయతీలో బుధవారం వరి రైతు పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా అక్కడక్కడ కాండం తొలుచు పురుగు మరియు ఆకు చుట్టు పురుగు గమనించడం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి తెలియజేశారు. నివారణకు క్లోరోపైరిఫాస్ అనే మందులు ఒక లీటర్ నీటికి 2,ఎంఎల్ చొప్పున మరియు కార్గో ఫ్యూరాన్ గుళికలను ఎకరానికి 10 కేజీలు చొప్పున ఇసుకతో కలిపి చల్లుకోవాలని రైతులకు తెలియజేశారు.

గ్రంథాలయ పితామహునికి ఘన నివాళి

విశాలాంధ్ర-కడప : అట్లూరుగ్రంథాలయం నందు బుధవారం గ్రంథాలయ ఉద్యమ కారుడు , గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య గారి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించినట్లు గ్రంథాల అధికారి సుధాకర్ పేర్కొన్నారు. అనంతరం ఆయన చేసిన సేవలు, ఆయన యొక్క విశిష్టతను కొనియాడుతూ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు గౌరీ శంకర్ గారు మరియు గ్రంథాలయ పాఠకులు వెంకటసుబ్బయ్య, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్కు రూ.35 వేల జరిమానా

న్యాయమూర్తి జింకా రెడ్డి శేఖర్ తీర్పు

విశాలాంధ్ర-రాయచోటి రూరల్ : ఎక్స్పైరీ అయిన టాల్కమ్ పౌడర్ను ఎమ్మార్పీ రేట్కు మించి అమ్మిన ఓ సూపర్ మార్కెట్ యాజమాన్యంకి ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకా రెడ్డి శేఖర్ రూ.35 వేలు జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే నెల్లూరుకు చెందిన బీటెక్ విద్యార్థి 2022 సెప్టెంబరు 15న ఓ సూపర్ మార్కెట్ లో పాండ్స్ పౌడర్ ను కొనుగోలు చేశాడు. 2022 సెప్టెంబరు 20న పౌడర్ను వాడిన గంట వ్యవధిలోనే మొహంపై రాషెస్, దద్దుర్లు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. వైద్యుడు పరీక్షించి ఎక్స్పైరీ అయిన టాల్కమ్ పౌడర్ను వాడడం వలనే మొహంపై దదర్లు వచ్చుంటాయని చెప్పడంతో పౌడర్ డబ్బాను గమనించగా ఆ పౌడర్ ఆగస్టు 2021లోనే ఎక్స్పైరీ అయిపోయింది.. పైగా పౌడర్ డబ్బా పై ఎమ్మార్పీ ధర రూ.75 ఉండగా సూపర్ మార్కెట్ రూ.84 కు అమ్మింది.. దీంతో బాధితుడు నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన న్యాయమూర్తి జింకా రెడ్డి శేఖర్ ఆధారాలను పరిశీలించాక ఎక్స్పైరీ అయిన పాండ్స్ టాల్కమ్ పౌడర్ ను.. ఎమ్మార్పీ రేట్ కు మించి అమ్మారని, పౌడర్ వాడడంతో భాధితుడి మొహంపై ఎర్రటి రాషెస్, దద్దుర్లు వచ్చినట్లు నిర్ధారించారు. తీర్పును వెలువరిస్తూ ఆయన రిటైలర్ పాత్ర అత్యంత ముఖ్యమైనదన్నారు. వినియోగదారుడికి, రిటైలర్ కు ప్రత్యక్ష సంబంధం ఉన్నందున రిటైలర్ వస్తువులను సరఫరా చేసే ముందు, వాటి నాణ్యత, గడువు తేదీ మొదలైన వాటికి సంబంధించి నిర్ధారించుకోవాలన్నారు. లోపభూయిష్ట వస్తువులను సరఫరా చేయడానికి మరియు కొనుగోలుదారుకు మానసిక మరియు శారీరక వేదన కలిగించడానికి ప్రధానంగా రిటైలర్ బాధ్యత వహిస్తాడని తెలిపారు. భాదితుడికి రూ.35 వేలు తీర్పు వెలువడిన 45 రోజుల్లోపు చెల్లించాలని రిటైలర్ సూపర్ మార్కెట్ను ఆదేశించాడు. లేని పక్షంలో తీర్పు వెలువడిన తేదీ నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు.

మదనపల్లె సబ్ డివిజన్ భూసమస్యల వినతులు స్వీకరిస్తాం: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా మదనపల్లెకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్‌పి సిసోడియా, మదనపల్లె సబ్ డివిజన్‌కు సంబంధించిన భూ వివాదాల సమస్యలను స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 25, గురువారం సాయంత్రం 4 గంటల నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్‌పి సిసోడియా, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని, మదనపల్లె సబ్ డివిజన్‌లోని 11 మండలాలకు సంబంధించిన గత 2 నుంచి 3 సంవత్సరాల భూ వివాదాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ)కు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రానికి జీవం పోసిన పవన్‌కళ్యాణ్

విశాలాంధ్ర - జమ్మలమడుగు : రాష్ట్ర భవిష్యత్ కు జీవం పోసిన ప్యాకేజి స్టార్ జనసేన అధినేత మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని జమ్మలమడుగు జనసేన పార్టీ కో ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున పేర్కొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు అతని అనుచర వర్గం అంతా పవన్ కళ్యాణ్ ను ప్యాకేజి స్టార్ అని అంటూ విమర్శించారు. అవును ఆయన కేంద్ర ప్రభుత్వం తో రాష్ట్రానికి ప్యాకేజి తీసుకువచ్చే స్టార్ అని ఆయన తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా గుర్తించి రూ.15 వేలు కోట్లను బడ్జెట్ లో కేటాయించడం కూటమి ప్రభుత్వ విజయం అన్నారు.ఎన్నో సంవత్సరాల నుంచి పూర్తి కానీ పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు పూర్తిగా సహకరిస్తామని చెప్పడం హర్షించ తగ్గ విషయం అన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన జిల్లాలను ఆర్థిక సాయం చేసి ఆదుకుంటామని చెప్పడమే కాక రోడ్లు, రైల్వే, త్రాగునీటి సమస్యల పై కూడా మంచి చేస్తామని చెప్పడం శుభ పరిణామమే అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ఏర్పడటానికి మూలకారకుడు జనసే నాని పవన్ కళ్యాణ్ అని ఆయన గుర్తు చేశారు. తప్పు చేస్తే తనపై కూడా చర్యలు తీసుకోవాలని శాసన సభలోనే చెప్పిన ఏకైక నిబద్ధత గల నేత పవన్ కళ్యాణ్ అన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వంకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

హైవే పనులను అడ్డుకున్న రైతులు

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో బళ్లారి కృష్ణపట్నం నేషనల్ హైవే పనులను హైవేకు భూములు కోల్పోయి నష్టపరిహారం అందని బాధిత రైతు కుటుంబాల సభ్యులతో కలిసి హైవే పనులను అడ్డుకున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అనంతరం నేషనల్ హైవే కాంట్రాక్ట్ ప్రతినిధులు పోలీస్ అధికారులకు సమాచారం అందజేయడంతో మైదుకూరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పీ మస్తాన్, అర్బన్ సబ్ ఇన్స్పెక్టర్ గణ మద్దిలేటి, తమ సిబ్బందితో హైవే పనులను అడ్డుకున్న ప్రాంతానికి చేరుకోవడం జరిగింది. పనులను అడ్డుకొని నిరసన తెలియజేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయ కులతో మరియు హైవేకు భూములు కోల్పోయిన బాధిత రైతు కుటుంబాల సభ్యులతో పోలీస్ అధికారులు మాట్లాడి సమస్యను తాహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లగా తాహసిల్దారు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వైయస్సార్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడు తూ ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉత్పన్నమైతే ఆ సమస్యలను అధికారులు పరిష్కరించకపోవడం వలన బాధితులు అయితే నేమి రైతు సంఘం నాయకులైతేనేమి ఇలాంటి నిరసన కార్యక్రమాలు చేయవలసిన అగత్యం అవసరం అవుతా ఉన్నదని ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు నేషనల్ హైవేకు భూములు కోల్పోయిన బాధిత రైతు కుటుంబాల చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి వారికి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మరియు ఇతర ప్రజాసంఘాల ఆధ్వ ర్యంలో నిరసన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని వారు తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్య క్షులు చిలింగారి పెద్ద పుల్లయ్య, రైతు సంఘం నాయకులు కొమ్మినేని చెన్నయ్య, కంచం నారాయణ మరి యు బాధిత రైతు కుటుంబాల సభ్యులు పాల్గొనడం జరిగింది.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సంబేపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం "శిక్షా సప్తాహ్"విద్యా వారోత్సవాలలో భాగంగా , మూడవ రోజు విద్యార్థులకు ఫిజికల్ డైరెక్టర్ షామీర్ బాషా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తొక్కుడుబిల్లా, బారాకట్ట,పులిగీతం, మేక-పులి, బాస్కెట్ బాల్, కర్రా బిల్లా మొదలైన ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా ప్రిన్సి పాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఆటల ను జీవితంలో భాగం చేసుకోవాలని ఆటలు,యోగ ,యోగాసనాలను వేయ డం విద్యార్థులు తమ నిత్యకృత్యాలుగా చేసుకోవాలనీ, ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ షామీర్ బాషా, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయితీలలో పంచాయతీ సిబ్బంది సర్పంచులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో నిర్మలాదేవి తెలిపారు. బుధవారం సంబేపల్లి మండల పరిషత్ సభ భవనంలో సర్పంచులకు సెక్రెటరీ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామా లలో మురుగునీరు నిల్వ లేకుండా చేయాలన్నారు మీరు నిల్వ ఉన్నచోట శానిటేషన్ కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు . వినాయక చవితి సందర్భంగా గ్రామాలలో మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ఆర్ డి సునీల్ కుమార్ ,సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో బిటెక్ రవికి సముచిత స్థానం కల్పించాలి

విశాలాంధ్ర-వేంపల్లి: ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో పులివెందుల అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి బిటెక్ రవికి సముచిత స్థానం కల్పించాలని ఆ పార్టీ యువనేత రెడ్డికిశోర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి కొనసాగంతూ విశిష్ట సేవలందించారన్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నా కూడా ఏ మాత్రం వెనుకంజ వేయకుండా ప్రత్యర్థిపార్టీల నాయకుల విమర్శలను తిప్పిగొట్టడంతో దిట్టగా పేరుందన్నారు. టీడీపీ కేడర్‌ను నియోజకవర్గ వ్యాప్తంగా పటిష్టం చేయడంలో బిటెక్ రవి తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించారన్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి బాగోగులను చూసుకుంటూ మరోవైపు నాయకత్నం లోటు లేదనిపించారన్నారు. ఇప్పుడు ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కోవడంతో ఆయనకు ఆయనే సాటి అన్నారు. వైసీపీ అధినేత జగన్‌కు పోటీనివ్వడంలో ఎంతో ధైర్యసాహసాలను ప్రదర్శించి, జగన్ ఓటు బ్యాంక్‌ను చావుదెబ్బతీశారన్నారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌కు మెజారిటీ తగ్గించడంలో బిటెక్ రవి వెనుక విశేష కృషి దాగివుందన్నారు. వైఎస్ కుటుంబ సభ్యులకు కంచుకోటగా పేరొందిన పులివెం దుల నియోజకవర్గంలో వైఎస్ జగన్‌ను ఢీకొనడం ఆషామాషీ కాదన్నారు. ఇటువంటి పరిస్థితు ల్లో అందరి అంచనాలను తారు మారు చేసి జగన్‌కు మెజారిటీ తగ్గించారన్నా రు. కార్యకర్తలు కూడా బిటెక్ రవికి వెన్నుదన్నుగా నిలవడంతో అసాధ్యమన్నది సుసాధ్యం చేశారని కొనియాడా రు. బంధువర్గం, అనుచర వర్గం బలంగా ఉన్న పులివెందుల నియోజకర్గ పరిధిలో అత్యంత బలమైన నేతగా బిటెక్ రవి ఎదిగారన్నారు. అందరూ ఊహించినట్లుగానే ఎన్డీయే కూటమి అధికారం చేపట్టిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బిటెక్ రవికి నామినేటెడ్ పదువుల్లో రాష్ట్రస్థాయిలో పదవి అప్పగించాలన్న ఆకాంక్ష నియోజకవర్గ ప్రజల్లో బలంగా నాటుకుపోయిందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు బిటెక్ రవికి రాష్ట్రస్థాయి పదవి అప్పగిస్తే టీడీపీకి ఎదురులేకుండా ఉంటుందన్నా రు. 2029 ఎన్నికనల్లో బిటెక్ రవి సారధ్యంలో పులివెందుల గడ్డపై టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని, ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు స్పందిస్తారని రెడ్డికిషోర్ ఆశాభావం వ్యక్తంచేశారు.

ఈ పాఠశాలకు మోక్షం ఎన్నడో?

నిధులు లేక ఆగిన పనులు.. విద్యార్థుల భవిష్యత్తుతో అధికారులు నిర్లక్ష్యం

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : మండల పరిధి లోని నరసన్న పల్లెలో ఉన్న మండల పరిషత్ పాఠశాలలో అభివృద్ధికి ఆమని దూరంలో ఉండడం ఈ పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థులు చదువుకుంటూ ఉండడం ఈ పాఠశాలకు మౌలిక సదుపాయాలు అంతంత మాత్రమే ఉన్నాయని గతంలో నాడు నేడు ద్వారా పనులు ప్రారంభమై అరకొర పనులు జరిగి నిధులు లేక పనులు పూర్తికాక పోవడం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు సరిలేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాంపౌండ్ వాల్ సాంక్షన్ అయిన పనులు మాత్రం పూర్తిగా కాకపోవడం అధికార నిర్లక్ష్యమా అనుపమ ప్రశ్నిస్తున్నారు కాంపౌండ్ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు తప్పుతూ అవస్థలు పడుతున్నారని మధ్యాహ్నం భోజనం సమయంలో పక్కనే ఉన్న మురికి కాలువ వద్ద అభం శుభం తెలియని చిన్నారులు అక్కడున్న భోజనాలు చేస్తూ ఉండడంతో మురికి కలవద్ద దోమలు కొంత ఇబ్బందిగా విద్యార్థులు పడుతూ భోజనాలు చేస్తున్నారు. పక్కనే మల్లెపల్లె బ్రహ్మంగారి మటానికి ప్రధాన రహదారి కావడంతో విద్యార్థులు విశ్రాంతి సమయంలో బయటికి రావాలన్న విద్యా ర్థులు తల్లిదండ్రులు గురవుతున్నారు గతంలో కూడా కొంతమంది విద్యార్థులకు 2 వీలర్స్ వెహికల్స్ చిన్నచిన్న ప్రమా దాలు కూడా జరిగాయని అధికారులు ఇప్పటికైనా ఈ పాఠశాలకు కాంపౌండ్ వాళ్ళు పూర్తిచేసి విద్యార్థుల యొక్క సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని గత ప్రభుత్వం ప్రభుత్వం నాడు నేడు ద్వారా పనుల అనుమతి రావడంతో అప్పట్లో ఉన్న ప్రధానోపాధ్యాయులు కొంత నిర్లక్ష్యం వల్ల పనులు కాంపౌండ్ వాళ్ళు ఆగిపోవడం తిరిగి ఆ ఉపాధ్యాయుడు వేరే పాఠశాలకు బదిలీల కావడంతో అక్కడ పనులు మళ్లీ ప్రారంభమై పనులు కూడా పనులు జరిగాయని ప్రభుత్వం నుండి రాకపోవడంతో పనులు మాత్రమే జరుగుతున్నాయి. ఇప్పటికైనా పనులు వేగవంతం చేసి విద్యార్థుల యొక్క భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కాంపౌండ్ వాళ్ళు పూర్తిచేసి పక్కనే ఉన్న వీధి మురికి నీరుని పాఠశాల వైపు రాకుండా చూడాలని విద్యార్థులు తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను

విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో కడప, అన్నమయ్య జిల్లాల్లో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.

పనిచేయవలసిన మండలాలు :

కడపజిల్లా కడప సిటి, ఒంటిమిట్ట, సి.కె. దిన్నె, వి.ఎన్.పల్లి, చక్రాయపేట, పెద్దముడియం, రాజుపాలెం, చాపాడు, పెండ్లిమర్రి, కలసపాడు , ఖాజీపేట

అన్నమయ్యజిల్లా రాయచోటి రూరల్, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేల్, రైల్వేకోడూరు రూరల్, చిన్నమండ్యం, సంబేపల్లి, వీరబల్లి, కలకడ, కె.వి.పల్లి, కలికిరి, పిటియం వాల్మీకిపురం, తంబళ్లపల్లి, కురబలకోట, మొలకలచెరువు, మదనపల్లి రూరల్, నిమ్మనపలి

గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి

సంప్రదించవలసిన నెంబరు: 9985589444